క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని రెవెన్యూ క్వాటర్స్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో బుధవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆసుపత్రి డాక్టర్ గ్రేస్ సెలస్టియల్ ఆధ్వర్యంలో దాదాపు రెండు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. కీళ్ల నొప్పులు, గ్యాస్ ట్రబుల్, పక్షవాతం, బీపీ, షుగర్ తదితర రకాల రోగులకు మందులు అందజేశారు. అనంతరం వివిధ రోగాలను యోగాసనాలతో రోగాలను నయం చేసుకునే విధానాన్ని శిక్షకులు ప్రతాప్, సోని వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోట ఎస్సీ కాలనీకి చెందిన రాగిమాను ఆంజనేయులు ఇంట్లో బుధవారం తెల్లవారు జామున షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో విద్యుత్ బోర్డు నుంచి ఒక్క సారిగా మంటలు, పొగ వ్యాపించింది. పసిగట్టిన కుటుంబ సభ్యులు సురక్షితంగా బయట పడ్డారు. మంటల దాటికి టీవీ, ఫ్రిజ్, పర్నీచర్, ఎలక్ట్రానిక్ తదితర వస్తువులు కాలిపోయాయి. దాదాపు లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో వెలసిన శ్రీ పర్వతవర్ధనీ రామనాథేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం, గ్రామస్తుల ఆధ్వర్యంలో వేద పండితులు చంద్రశేఖర శర్మ, రంగనాథ శర్మలు సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామికి ప్రాతఃకాల పూజలు, నిత్యార్చన, పంచసూక్త హవనం, బలి హరణ, వేద స్వస్తి తదితర పూజలు చేశారు.


చలివేంద్రం ఏర్పాటు

డోన్ టౌన్: ప్రయాణికుల సౌకర్యార్థం భారత్ గ్యాస్ డీలర్ రాజా విజయ్‌కుమార్ ఆర్థిక సాయంతో స్థానిక ఆర్టీసీ కొత్తబస్టాండ్ ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ మేరకు బుధవారం స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సచీంద్రబాబులతో కలిసి చలివేంద్రాన్ని ఆర్టీసీ డీఎం శశిభూషణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మద్దయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు మోజెస్, జిలానీ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొలిమిగుండ్ల: తిమ్మనాయినిపేట జంక్షన్‌లోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో దాతల సహకారంతో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. దాతలు గోపాల్, రాఘవ రెడ్డి, మాజీ సర్పంచ్ బాబూజీ సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కోవెలకుంట్ల, జమ్మలమడుగు, తాడిపత్రి తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న చలం రెడ్డి

బేతంచెర్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లపై ఉందని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని ఐదవ సచివాలయంతో పాటు, బుగ్గానిపల్లె గ్రామంలోని సచివాలయంలో గ్రామ సచివాలయ కన్వీనర్లకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మీ కుటుంబాల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా పరిశీలించాలన్నారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని, తీవ్రమైన సమస్య తమ దృష్టికి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సచివాలయ కన్వీనర్ అజాం బాషా, సచివాలయ కన్వీనర్లు కిరణ్, వలీబాషా, అమ్మని పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లో బందో బస్తు

డోన్ టౌన్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టు నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలో భాగంగా రైల్వే స్టేషన్లలో బుధవారం రైల్వే పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని రైల్వే సీఐ సుబ్బయ్య తెలిపారు. బందోబస్తు విధుల్లో రైల్వే ఎస్ఐ బాల కోటేశ్వర రావు సిబ్బంది ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ పథకాలలో సింహభాగం స్త్రీలకే
- ఆసరా ముగింపు వారోత్సవాల్లో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన
- 746 గ్రూపులకు రూ.4,64,57,820 పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సమావేశానికి తరలివచ్చిన పొదుపు మహిళలు

డోన్ : మహిళల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక సాయి శ్రీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా ముగింపు ఉత్సవాల్లో బుధవారం మంత్రి పొదుపు మహిళలకు చెక్కులను అందజేశారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షత వహించగా అతిథులుగా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇప్పటి వరకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా ఆర్థికాభివృద్ధికి అమలు చేసిన, చేస్తున్న పథకాల గురించి వివరంచారు. మహిళ ఆర్థికాభివృద్ధిపైనే కుటుంబ, సమాజ అభివృద్ధి ఆధారపడి ఉంటాయన్నారు. మహిళలు అన్నిరంగాల్లో మరింతగా రాణించాలనే ఉద్దేశంతోనే అనేక చేతివృత్తుల్లో ప్రభుత్వం శిక్షణ ఇచ్చేందుకు నియోజకవర్గానికి ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అల్లికలు, కుట్లు, ఎంబ్రాయిడరీ, కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ప్రత్యేక కాలపరిమితితో శిక్షణ ఇచ్చి విద్యావంతులైన మహిళలకు ఉపాధి అవకాశాలను కూడా ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. అన్ని సంక్షేమ పథకాలను మహిళల పేరుపైనే వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వ్యాపార, వాణిజ్య రంగాల్లో రాణించేందుకు అనేక పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మహిళల పేరుమీదనే ఇంటి నివేశన స్థలాల పట్టాలు ఇవ్వడంతో పాటు పక్కాగృహాలను నిర్మించడం జరిగిందన్నారు. పొదుపులక్ష్మి గ్రూపులకు వడ్డీలేని రుణాలను అందిస్తూ మహిళా ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తున్నది ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని గుర్తు చేశారు.

746 గ్రూపులకు రూ.4,64,57,820

డోన్ మండలంలో వైఎస్ఆర్ ఆసరా పథకం కింద 746 గ్రూపులకు సంబంధించి 7531 మంది పొదుపు మహిళలకు రూ.4,64,57,820లను వడ్డీ మాఫీ కింద అందజేయడం జరిగిందని మంత్రి వివరించారు. దీంతో మహిళలకు ఎంతో ఆర్థిక ఊరట కలిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం మహిళలను మోసగించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. పసుపు, కుంకుమ పేరుతో చంద్రబాబు పొదుపు మహిళలను దారుణంగా మోసగించిన సంగతి ఇప్పటికీ గుర్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్ యాదవ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఏపీఎం రామాంజనేయులు, టీఎంసీ సుజాత, సీఓ జయంతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు వరలక్ష్మి, మెప్మా పీడీ నాగశివలీల, గృహ సారథుల పట్టణ కన్వీనర్ కురుకుందు హరి, ఆర్‌డీఓ వెంకటరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించాలి

బేతంచెర్ల: భూ సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూరక్ష రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో సర్పంచ్ గుమ్మగాల్ల రాజు, వైస్ ఎంపీపీ రంగస్వామి, వెంకటలక్షమ్మ, ఎంపీటీసీ నాగ శేషు, మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోరైతులతో రీసర్వేపై రైతులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రీ సర్వే ద్వారా రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డీటీ సత్యదీప్, ఆర్ఐ శ్రీదేవి, మండల సర్వేయర్ జ్యోస్నా పాల్గొన్నారు.

కొత్త రైతులు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

డోన్ టౌన్: వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద లబ్ధిపొందడానికి అర్హత గల కొత్త రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా పాస్ బుక్‌లు మంజూరైన రైతులు పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుంటే 2023-24 సంవత్సరాని రైతు భరోసా అందిస్తామన్నారు. ఇందు కోసం పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్‌ల జిరాక్స్ కాఫీలతో స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకున్ని కలిసి నమోదు చేయించుకోవాలన్నారు.

నేటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

బేతంచెర్ల : పట్టణంలోని గౌరీపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ప్రతిరోజు స్వామి అమ్మవార్లు ప్రత్యేక అలంకరణ ఉంటుందని, పురవీధులగుండా ఊరేగింపు ఉంటుందని ఈఓ మద్దిలేటి, ఆలయ అర్చకులు శ్రీకాంత్, రామయ్య శర్మ తెలిపారు. 6వ తేదీన ప్రత్యేక పూజలు, 7న కల్యాణ మహోత్సవం, హనుమద్వాహనంపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు, 8న గరుడవాహనం, 9న శేషవాహనం, 10న గజవాహనం, 11న ఉదయం సింహ వాహనం, సాయంత్రం రథోత్సవం ఉంటుందన్నారు. అదేవిధంగా 12న పూర్ణాహుతి (వసంతోత్సవం) తో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నరు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కోవెలకుంట్ల: జమ్మలమడుగు ఆర్అండ్‌బీ రహదారిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ దినపత్రిక విలేకరి ఉసేనప్పకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు సమాచారం మేరకు.. వైఎస్సార్ జిల్లా పొలతలకు మొక్కుబడి తీర్చుకునేందుకు సొంత ఆటోలో రెండు రోజుల క్రితం కుటుంబ సమేతంగా వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఉయ్యాలవాడ మండలం గోవిందపల్లె మెట్ట సమీపంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఉసేనప్ప ముఖానికి బలమైన గాయాలయ్యాయి. అదేవిధంగా విలేకరి కుటుంబ సభ్యులైన వెంకటసుబ్బమ్మ, సుబ్బమ్మకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా కోవెలకుంట్ల ఆసుపత్రిలో చేర్పించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విలేకరిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

ఉమా మహేశ్వరస్వామి క్షేత్రంలో పూజలు



యాగంటి క్షేత్రంలో చాగంటి కోటేశ్వరరావు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ, కాటసాని జయమ్మ

బనగానపల్లెరూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామిని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుతోపాటు పాణ్యం ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సతీమణి ఉమా మహేశ్వరమ్మ దంపతులు, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఏకశిలారూపంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వర స్వామికి అభిషేకం అర్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం మేరకు వీరిని సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుమారుడు కాటసాని నరసింహారెడ్డి, దేవదాయ శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, ఉమా మహేశ్వర స్వామి నిత్యాన్నదాన సంస్థ సభ్యులు దస్తగిరిరెడ్డి, రామారెడ్డి, విశ్వహిందూ పరిషత్ బనగానపల్లె ప్రఖండ కార్యదర్శి ఓబులరెడ్డి, జిల్లా సహకార్యదర్శి కిశోర్‌కుమార్, మాతృమండలి సంయోజక్ గంగా భవానీ దేవి తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వెచ్చించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను బుధవారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నరసింహారెడ్డి తన సొంత నిధులతో పేదలకు సాయం చేస్తుండటం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో రాయలసీమ స్టూడెంట్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఓబులేసు, న్యాయవాది రాజశేఖర్, రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, శ్యాం బాబు, సుబ్బయ్య పాఠకులు పాల్గొన్నారు.

7 నుంచి జగనన్నే మా భవిష్యత్తు

- గృహసారథులుప్రతి, కన్వీనర్లు, వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించాలి
- ప్రజలకు ప్రభుత్వ పంథకాలను వివరించాలి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నాయకులు

బనగానపల్లె: ఈ నెల 7 నుంచి రెండువారాల పాటు గ్రామాల వారీగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జీలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో 7లక్షల మంది సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు 1.60కోట్ల కుటుంబాలను సందర్శిస్తారాన్నరు. సచివాలయ పరిధిలోని ముగ్గురు వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వలంటీర్లులతో కలిసి ఇంటింటికి వెళ్లి జగనన్న నాలుగేళ్లుగా అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. ప్రతి కుటుంబాన్ని పలుకరిస్తారని, కుటుంబ సభ్యులకు 10 నుంచి15 నిమిషాలు సంక్షేమ పథకాల అమలు తీరును విశదీకరిస్తాన్నారు. అన్ని అర్హతలు ఉండి కూడా సంక్షేమ పథకాలు అందనివారు ఉంటే వారికి కూడా ఈ నెల 13వ తేదీన జగనన్నకు చెబుదామనే కార్యక్రమంలో గ్రీవెన్స్ ద్వారా నేరుగా సీఎం వైఎస్ జగన్‌కు తెలియజేసి న్యాయం చేస్తారన్నారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఆ కుటుంబ సభ్యుల మొబైల్‌తో 82960 82960కు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. అదేవిధంగా కుటుంబ సభ్యుల అనుమతితో ప్రతి ఇంటికీ జగనన్నే మా నమ్మకం అనే స్టిక్కర్‌ను అతికించాలని సూచించారు. 2024లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలంటే ప్రభుత్వం అమలు చేసిన... చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా బాధ్యతగా గృహసారథులు, కన్వీనర్లు వలంటీర్లు వివరించాల్సి ఉంటుందన్నారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమ పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, నాయకులు డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, మహబూబ్‌వలి, రామవరం సర్పంచ్ మనోహర్‌యాదవ్ శంకర్‌రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

బేతంచెర్ల: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని రిటైర్డ్ డీఎస్పీ (పాణ్యం సిమెంట్స్ సీఎస్ఓ)నరసింహారెడ్డి, జీఎం రాఘవరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో వెలసిన పర్వత వర్ధనీ రామనాథేశ్వర, సీతారామ కళ్యాణ మహోత్సవం సందర్భంగా పాణ్యం సిమెంట్స్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు యాకోబ్, సత్యం, క్రీడాకారులు రమేష్,రాజేష్, జాకోబ్, పత్తికొండ వలీ పాల్గొన్నారు.

12న బండలాగుడు పోటీలు

బేతంచెర్ల : బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని 12వ తేదీన ఆరు పండ్లలోపు వృషభరాజములకు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత వృషభాల యాజమాన్యాలకు రూ. 50వేలు, రూ.40 వేలు, రూ. 30వేలు, రూ.20వేలు, రూ.15 వేలు చొప్పున అందజేస్తామన్నారు. 11వ తేదీ సాయంత్రంలోగా రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు.

ఉచిత కంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



కంటివైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: ఉచిత కంటి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చల్లా రాజశేఖర రెడ్డి సూచించారు. అవుకు పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఐమిత్ర విజన్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని బుధవారం ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం వైద్యులు స్థానిక ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. కంటి సమస్య మేరకు కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రిలో శుక్లాలకు ఆపరేషన్, మెల్లకన్ను ఆపరేషన్, రెటీనా, కార్నియా , గ్లకోమా (నీటికాసులు), కొయ్యకండ(టెరిజియం), కంటి ప్లాస్టిక్ సర్జరీ తదితర చికిత్సలు ఉచితంగా చేస్తారని తెలిపారు. అనంతరం కంటి వైద్యులు గోపాల్ రోగులకు కంటి పరీక్షలు చేశారు.

జగ్జీవన్ రాం ఆశయ సాధనకు కృషి చేయాలి



జగ్జీవన్‌రాం చిత్ర పటానికి పూలమాల వేస్తున్న మంత్రి బుగ్గన

డోన్ టౌన్: స్వాతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్‌రాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. జగ్జీవన్‌రాం జయంతిని పురష్కరించుకుని ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27ఏళ్ళ అతి చిన్న వయస్సులోనే శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన వ్యక్తి అని కొనియాడారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడుతూ సామాజిక సమానతత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడని పేర్కొన్నారు.

ప్యాపిలి: స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉప ప్రధానిగా, కేంద్రమంత్రిగా బాబూ జగ్జీవన్‌రాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరంగన్న అన్నారు. బుధవారం స్థానిక బస్టాండ్ వద్ద జగ్జీవన్‌రాం జయంతి నిర్వహించారు. జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామచంద్రుడు, అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు ఆర్పీ మద్దిలేటి, ఎరుకల సంఘం నాయకులు శేషాద్రి, మణి పాల్గొన్నారు.

బేతంచెర్ల : జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం డోన్ రహదారిలోని ఆయన విగ్రహానికి సీఐ ప్రియతం రెడ్డి, ఎమ్మార్పీయస్ నాయకులు రాజయ్య, రామసుబ్బయ్య, మాల మహానాడు నాయకులు మేకల నాగరాజు, బొల్లి మద్దిలేటి, రూబెన్ తదితరులు పూలమాలలు వేసి నివాళుల్పరించారు. నగర పంచాయతీ కార్యలయంలో చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, షేక్ ముబీనా, వైఎస్సార్‌సీపీ సచివాలయ పట్టణ కన్వీనర్ అజంబాషా, నాయకులు ఖాజా, దస్తగిరి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాయలంలో ఈఓఆర్డీ వెంకట రంగనాయక్, సూపరిండెంట్ దస్తగిరి, ఏపీఓ శేషన్న తదితరులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల్పరించారు.


డోన్ రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్‌జీవన్‌రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీనియర్ అసిస్టెంట్ సుధీర్, మధుసూదన్‌బాబు, మెడికల్ ఆఫీసర్ భూపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: దేశ స్వాతంత్ర్య సమరయోధుడు సంఘ సంస్కర్త,భారత్ ఉపప్రధాన మంత్రి బాబు జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల లో బాబు జగ్జీవన్‌రామ్ 116 జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలోజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నాయకులు సుధాకర్, ప్రతాప్, దస్తగిరి, నాగరాజు, మనోహర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్ఓ వెంకట్రామి రెడ్డి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురష్కరించుకొని ఆయన చిత్రపటానికి ఉద్యోగులు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.


కోవెలకుంట్ల: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి దివంగత ఉప ప్రధాని బాబు జగజ్జీవన్‌రామ్ ఎంతగానో కృషి చేశారని వక్తలు కొనియాడారు. జగజ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలను బుధవారం బనగానపల్లె నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఎంఈఓ తిమ్మారెడ్డి, హెచ్ఎం అరుణకుమారి, తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్ఓ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు శివప్రసాద్, నీరజ, జ్యోతి, జహీరాబి, సుగుణ, వరలక్ష్మి, తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాంనాథరెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని పురష్కరించుకొని ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ సుబ్బరాజుతోపాటు ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, ఏపీఓ గంగన్న, నందిపాడు, చింతలాయిపల్లె సర్పంచ్‌లు, గుర్విరెడ్డి, లక్ష్మీనారాయణ, నాయకులు పేరం నందకిషోర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, యాతం పెద్దిరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఇరికిమాను నాగేశ్వరరావు, రామచంద్రుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి.



పొదుపు మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

- స్త్రీల అభివృద్ధికి సంపూర్ణ ప్రోత్సాహం
- ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: మహిళల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నిరంగాల్లో ప్రాధాన్యత నిస్తూ ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. ప్రత్యేకించి స్త్రీల రాజకీయాభివృద్ధికి సహకారం అందజేస్తున్నారని, మంత్రివర్గంలోనూ వారికి ఎక్కువగా అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. మండల కేంద్రం కొలిమిగుండ్లలోని షిర్డీ సాయి పంక్షన్ హాల్‌లో బుధవారం వైఎస్ఆర్ ఆసరా మూడో విడత సంబరాల కార్యక్రమంలో భాగంగా పొదుపు మహిళలకు మెగా చెక్కును వారు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ 2019 నాటికి డ్వాక్రా మహిళలకు ఉన్న అప్పు పూర్తిగా నాలుగు విడతలుగా మాఫీ చేస్తానని పాదయాత్రలో ఇచ్చిన మేరకు నేరుగా మహిళల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నారని చెప్పారు. కొలిమిగుండ్ల మండలంలో మూడో విడతలో 915 గ్రామైక్య సంఘాలకు రూ.4.95 కోట్లు మాఫీ జరిగిందన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో మూడు విడతలుగా 4282 గ్రూపులకు రూ.84.89 కోట్లు రుణ మాఫీ అయ్యిందని వివరించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, బనగానపల్లె రూ.23 కోట్లతో చేపట్టిన వంద పడకల ఆసుపత్రి త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. భవిష్యత్‌లో తాగునీటి సమస్య మాటే వినకూడదనే ఉద్దేశంతో గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం కింద పనులు చేపడుతున్నామని గుర్తు చేశారు.

మంచి చేస్తుంటే ఓర్వలేకున్నారు...

పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తూ ప్రజలకు మంచి చేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక పసలేని విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ మండిపడ్డారు. టీడీపీ పాలనలో 2014 ఎన్నికలకు ముందు రూ.16వేల కోట్ల డ్వాక్రా రుణాలు చెల్లిస్తామని చంద్రబాబు మహిళలను నిండా మోసగించారని ఆరోపించారు. తీరా ఎన్నికల సమయంలో పొదుపు మహిళలకు పసుపు కుంకుమ పేరుతో మొక్కుబడిగా పది వేలు వేస్తే మళ్లీ అధికారంలోకి రావచ్చని కుట్రపన్నిన చంద్రబాబుకు మహిళలు గట్టిగా బుద్ధిచెప్పడంతో వైఎస్సార్‌సీపీ 151 స్థానాలు కైవసం చేసుకున్నామన్నారు. గడప గడపకు కార్యక్రమం చేపట్టి ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకొని పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నా టీడీపీ నాయకులకు ఖర్మపట్టి ఇదేం ఖర్మ అంటూ ప్రజలను మభ్య పెట్టేందుకు తిరుగుతున్నారని విమర్శించారు. కొలిమిగుండ్ల మండలంలో ఎనిమిది వేల ఎకరాల ప్రభుత్వ భూమిని అసైన్డ్ కింద పేదలకు పంపిణీ చేసేందుకు తాము సర్వం సిద్ధం చేస్తే మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డి కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. బీసీ ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లలో సెంటు భూమిని పేదలకు ఇప్పించారా... కనీసం ఆ ఆలోచనైనా వచ్చిందా అని నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, ఎంపీడీఓ సుబ్బరాజు, ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మునీశ్వరి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.